

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా ?

ఉండి ఎమ్మెల్యే రామరాజుకు వైఎస్సార్ సీపీ నేత పీవీఎల్ సవాల్

ఆకివీడు: అబద్ధాలడటం, మోసం చేయడం మీ పార్టీ సంస్కృతి. చెప్పింది చేయడం, చేసిందే చెప్పడం మా పార్టీ విధానం. పింఛన్లు, అమ్మఒడి పడలేదని ఆరోపణలు చేయడం కాదు.. దమ్ముంటే గడప గడప వద్ద బహిరంగ చర్చకు రావాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఉండి ఎమ్మెల్యే రామరాజుకు సవాల్ విసిరారు. సోమవారం మండలంలోని మందపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. మోసాలు చేయడం, చెవిలో పువ్వులు పెట్టడానికి వినే వారు ఎవరూ లేరని ఎద్దేవా చేశారు. టీడీపీ ప్రభుత్వంలో ఏమి చేశారో చెప్పండి, మేము ఏమి చేశామో చెబుతామన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో ఎక్కడా కన్పించని ఎమ్మెల్యే రామరాజు ఎన్నికలు వస్తున్నాయని లేనిపోని ఆరోపణలు చేసి, ప్రజలకు కంచాలు పంచిపెడితే ఓటు వేసే రోజులు పోయాయని ఆయన ఆరోపించారు. టీడీపీ వస్తే జగన్ పథకాలన్నీ రద్దు చేస్తామని చెబుతున్నారన్నారు, పవన్ అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను రద్దు చేస్తామని బహిరంగంగానే చెప్పారని పీవీఎల్ అన్నారు. పథకాలు, సంక్షేమం, అభివృద్ధి కావాలో.. మోసపూరిత పార్టీ పాలన కావాలో మీరే నిర్ణయించుకోండని ప్రజలకు తెలియజేశారు. పథకాలు ఎత్తేసి కంచాలతో అడుక్కునే విధంగా చేయాలని టీడీపీ ఎమ్మెల్యే రామరాజు ముందుగానే కంచాలిస్తేస్తున్నారని ఎద్దేవా చేశారు. నాలుగున్నరేళ్లలో మేము చేసిన అభివృద్ధి, ప్రజల సంక్షేమం బహిరంగంగా ఆయా సచివాలయాల వద్ద బోర్డులు పెట్టి చెబుతున్నామన్నారు. కాదని ఆయా సచివాలయాల వద్దకు వచ్చి ఎమ్మెల్యే రుజువు చేసే దమ్ముందా అని పీవీఎల్ ప్రశ్నించారు. కరోనా కష్టకాలంలో ప్రజల సంక్షేమం చూసింది సీఎం జగనేనన్నారు. కరోనాలో ఈ ఎమ్మెల్యే ఏమి చేశారని పీవీఎల్ ఆరోపించారు. నాలుగున్నరేళ్లలో ఎమ్మెల్యే చేయలేని పనులన్నీ నేను చేశాను.. అభివృద్ధి పనులు ప్రతి గ్రామంలో చేశాను.. ఎమ్మెల్యే ఏమైపోయాడో ప్రజలు నిలదీయాలన్నారు. ప్రతి గ్రామంలో చేయని పనిలేదని చెప్పారు. ప్రజల్ని సోమరిపోతుల్ని చేస్తున్నారని చంద్రబాబు, పవన్ కల్యాణ్ బహిరంగంగానే విమర్శిస్తున్నారని, మీ సంక్షేమం కోరడం, మిమ్మల్ని సోమరుల్ని చేయడమా అని ఆయన ప్రశ్నించారు. వ్యాపారాలు, ఆస్తులు కాపాడుకోవడానికి టీడీపీ నాయకులు ఉంటే, మేము ఆస్తులు కాపాడుకుంటానికి రావడం లేదు.. మాకున్న ఆస్తులు చాలు, మేము పన్నులు కట్టి మీ కోసం సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చామని పీవీఎల్ చెప్పారు. ప్రజా సంక్షేమం కోరే నాయకుడు కావా లో, ప్రజలను దోచుకునే నాయకుడు కావాలో మీరే వచ్చే ఎన్నికల్లో తేల్చాలని పీవీఎల్ ప్రజలకు పిలుపునిచ్చారు.


ఆకివీడు మండలం మందపాడులో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



సీఎం జగన్ పాలనలోనే సంక్షేమం

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- ఆకివీడు మండలం మందపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

ఆకివీడు: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ పరిపాలన కొనసాగిస్తేనే నవరత్నాలతో పాటు ఇతర పథకాలు ప్రజలకు అందుతాయని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. మండలంలోని మందపాడు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించిన పీవీఎల్ గ్రామంలో జరిగిన అభివృద్ధిని తెలియజేశారు. చదువు వల్లే పేదల బతుకులు మారతాయని 75 ఏళ్ల స్వాతంత్ర్యం అనంతరం గుర్తించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు నంద్యాల కృష్ణ, పెరుమాళ్ల రామకృష్ణ, పెరుమాళ్ల పెద వెంకటేశ్వరరావు, పెద్దిరాజు, నంగన వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, ఎంపీటీసీ అంగడాళ్ళ సూర్యభవాని, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, జేసీఎ కన్వీనర్లు పుప్పాల పండు, శిరపు శ్రీనివాస్, మండల బూత్ కన్వీనర్ అంబటి రమేష్, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు అన్యం కృష్ణ, గుండా సుందరరామనాయుడు, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు గాలి సామ్రాజ్యం, మాజీ ఎంపీపీ గొట్టుముక్కల బాబ్జీరాజు తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

గల్ఫ్ వెళ్లే మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలి


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉమాబాల

భీమవరం: ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లే మహిళలు ఏజెంట్ల మోసాల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల అన్నారు. భీమవరంలో సోమవారం నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యాన జరిగిన మహిళా సదస్సులో ఆమె మాట్లాడారు. గల్ఫ్ ఏజెంట్లకు ప్రభుత్వం జారీ చేసిన రిజిస్టర్ రిక్రూటింగ్ లైసెన్స్ ఉందో లేదో తెలుసుకోవాలన్నారు. ట్రస్ట్ జాతీయ అధ్యక్షురాలు లిస్సీ జోషఫ్ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నేడు తాగునీటి సరఫరా నిలిపివేత

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో దుర్గాపురం కొత్త రిజర్వాయర్ పంపింగ్ మెయిన్ ఇంటర్ కనెక్షన్ పనులు అత్యవసరంగా చేపట్టినందున టూటౌన్ ప్రాంతం, వన్‌టౌన్‌లోని 7వ వార్డు, 10 నుంచి 18వ వార్డులు, 23 నుంచి 28వ వార్డులకు మంగళవారం సాయంత్రం తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు కమిషనర్ ఎం.శ్యామల తెలిపారు.

నేడు దొడ్డనపూడిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కాళ్ల: మండలంలోని దొడ్డనపూడి గ్రామంలో మంగళవారం 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు తెలిపారు. ముఖ్యఅతిథిగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు హాజరుకానున్నారు.

చిలుకూరులో..

ఉండి: మండలంలోని చిలుకూరు గ్రామ సచివాలయం వద్ద మంగళవారం ఉదయం 9 గంటలకు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు హాజరుకావాలన్నారు.

సోమేశ్వరుడిని దర్శించుకున్న జీఎస్టీ అడిషనల్ కమిషనర్

భీమవరం(ప్రకాశంచౌక్): పంచారామ క్షేత్రం శ్రీ ఉమా సోమేశ్వర జనార్దన స్వామివార్లను జీఎస్టీ అడిషనల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం పలికారు. వారి వెంట జీఎస్టీ అధికారి పి.జగదీష్‌బాబు, డిప్యూటీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ తుమ్మిడి రాజశేఖర్, సత్యనారాయణ యాదవ్, ఆలయ ధర్మకర్తలు ఉన్నారు.





సెంట్రల్ జోన్ వాలీబాల్ పోటీల్లో విష్ణు విద్యార్థులకు తృతీయ స్థానం

భీమవరం: జేఎన్‌టీయూ సెంట్రల్ జోన్ వాలీబాల్ పోటీల్లో భీమవరం విష్ణు కళాశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం కళాశాలలో విజేతలను అభినందించిన సందర్భంగా వివరాలను వెల్లడించారు. ఈనెల 24వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఏలూరు సర్ సీఆర్ రెడ్డి కళాశాలలో జరిగిన సెంట్రల్ జోన్ గేమ్స్ మీట్‌లో తమ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారన్నారు. క్రీడాకారులను కళాశాల ప్రిన్సిపాల్ దశిక సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసరావు అభినందించారు.



















